# జర్నలిస్టుల 'అక్షర' మానవత్వం: దివంగత విలేకరి రజనీకాంత్ కుటుంబానికి రూ. 75 వేల ఆర్థిక సాయం


**తోటి జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలిచిన నాయుడుపేట మీడియా**

**టిడిపి మండల అధ్యక్షులు 786 రఫీ చేతుల మీదుగా నగదు అందజేత**

**అజాతశత్రువు రజనీకాంత్ సేవలు చిరస్మరణీయం: భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామన్న మీడియా**

నాయుడుపేట,పెన్ పవర్,జూలై 6 కష్ట సమయంలో తోటి విలేకరి కుటుంబానికి అండగా నిలిచి నాయుడుపేట పట్టణ మీడియా ప్రతినిధులు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల అకాల మరణం చెందిన సీనియర్ జర్నలిస్టు కందాటి రజనీకాంత్ కుటుంబాన్ని ఆదుకునేందుకు పట్టణ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు స్వచ్ఛందంగా నిధులు సేకరించారు.సోమవారం నాయుడుపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సహచర జర్నలిస్టులు అందరూ కలిసి సేకరించిన రూ. 75,000/- నగదును దివంగత రజనీకాంత్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ విరాళాన్ని నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు 786 షేక్ రఫీ స్వయంగా బాధిత కుటుంబానికి అందజేసి భరోసా ఇచ్చారు. అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం

ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. రజనీకాంత్ వృత్తిపరంగా ఎంతో క్రియాశీలంగా ఉండడంతో పాటు వ్యక్తిగతంగా కూడా అందరితో ఆప్యాయంగా మెలిగేవారని గుర్తు చేసుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరితో స్నేహంగా ఉండే ఆయన స్వభావం అందరికీ ఆదర్శమని కొనియాడారు. సమస్య వచ్చినప్పుడు అందరినీ కలుపుకుని ముందు నిలిచే గుణం రజనీకాంత్ ప్రత్యేకత అన్నారు. కుటుంబానికి అండగా మీడియా



రజనీకాంత్ మరణం నాయుడుపేట ప్రెస్ క్లబ్‌కు తీరని లోటని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి కొంత ఊరట కల్పించే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం అందించినట్లు జర్నలిస్టులు తెలిపారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా మీడియా శ్రేణులు అండగా ఉంటామని స్పష్టం చేశారు.ఈ మానవతా కార్యక్రమంలో నాయుడుపేటకు చెందిన వివిధ పత్రికలు, టీవీ ఛానళ్ల విలేకరులు, పాల్గొని దివంగతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# చెర్లోయడవల్లి ప్రజల అభిమానానికి అభివృద్ధే నా ధ్యేయం

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**రూ.2 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం**

**ఆలయాల అభివృద్ధి, విద్య, సాగునీరు, పరిశ్రమలతో ఆత్మకూరును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం**

**రెండేళ్లలో నియోజకవర్గానికి రూ.6,545 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు**

**ఎన్డీఏ కూటమి రెండేళ్ల పాలన విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్ ను ఆవిష్కరించిన మంత్రి ఆనం**





ఆత్మకూరు పెన్ పవర్ జూలై 6. చెర్లోయడవల్లి, జూలై 6: ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి గ్రామంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహిస్తూ జేజేలు, నినాదాలు, పూలవర్షం, హారతులతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. గ్రామ ప్రజల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి, ప్రజల ఆశీర్వాదమే తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

ఈ సందర్భంగా సుమారు రూ.2 కోట్ల వ్యయంతో పూర్తయిన నూతన జెడ్పీ హైస్కూల్ భవనం, సీసీ రోడ్లు, పశువుల షెడ్లు ప్రారంభించడంతో పాటు శ్రీ కోదండరామస్వామి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆత్మకూరు మండలంలోని ఈ గ్రామానికి రాలేకపోయినా తనను రెండోసారి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఆశీర్వదించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఆలయాల అభివృద్ధికి ప్రజల సహకారం ఆదర్శం

చెర్లోయడవల్లిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రస్తావించిన మంత్రి, దేవాదాయ శాఖ నుంచి రూ.5 లక్షల నిధులు అందించగా, గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా దాదాపు రూ.50 లక్షలు సమకూర్చి ఆలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావనకు ఇది నిదర్శనమన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ వీరాంజనేయస్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

గ్రామంలో మరో ఆలయ నిర్మాణం అవసరమని ప్రజలు కోరిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వ విధానాల్లో పరిమితులు ఉన్నప్పటికీ అవసరమైతే ప్రత్యేకంగా చర్యలు తీసుకుని ఆ ఆలయ నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేసే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు శాశ్వత ప్రయోజనం

రైతాంగ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సోమశిల ఉత్తరపు కాలువ పొడిగింపు, 42ఆర్ కాలువ పనులు ఎన్నో అడ్డంకులు ఎదురైనా పూర్తి చేసే దిశగా ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి సాగునీరు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. మిగిలిన పంటకాలువల పనులను కూడా దశలవారీగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

రెండేళ్లలో రూ.6,545 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

ఆత్మకూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ హయాంలో కేవలం రెండేళ్లలోనే సంక్షేమానికి రూ.3,461 కోట్లు, అభివృద్ధికి రూ.3,084 కోట్లు, మొత్తం రూ.6,545 కోట్లు వ్యయం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో నియోజకవర్గంలో అపూర్వమైన అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు.

పరిశ్రమలు -- యువతకు ఉపాధే లక్ష్యం

ఆత్మకూరును వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగంలోనూ అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రూ.67 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కును పూర్తి చేశామని, పరిశ్రమలకు అవసరమైన నీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 23 పరిశ్రమలు స్థలాలు కేటాయించుకున్నాయని, మరిన్ని భారీ పరిశ్రమలు వచ్చే దశలో ఉన్నాయని వెల్లడించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించి కొత్త పరిశ్రమలకు భూములు అందజేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు తమ ప్రాంతంలోనే ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం

యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు ఆత్మకూరులో ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యంతో ఆధునిక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు.

గతంలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలతో పాటు ఈ కేంద్రం ద్వారా స్థానిక యువతకు పరిశ్రమలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామీణాభివృద్ధి, సాగునీరు, విద్య, ఆలయాల పునరుద్ధరణ, పరిశ్రమల ఏర్పాటు వంటి అన్ని రంగాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు.తదుపరి ఎన్డీఏ కూటమి రెండేళ్లపాలన విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్ ను మంత్రి ఆనం ఆవిష్కరించారు.

అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల సన్నాహక సమావేశం

**బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని దుర్గా నగర్ నందు వెలసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నందు దేవస్థాన ట్రస్టు బోర్డు కమిటీ సభ్యుల సమావేశం జరిగింది.**

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 6. ఈ సమావేశానికి అధ్యక్షులు పుట్టా.లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు వ్యవస్థాపక ధర్మకర్తల మండలి అధ్యక్షులు కత్తుల.చెంగల్ రాయుడు మరియు ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా పుట్టా.లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ రానున్న అక్టోబర్ నెల 11వ తారీఖు నుండి జరగబోవు దసరా ఉత్సవాలకు సంబంధించి ఈరోజు ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించడం జరిగిందని అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన నవరాత్రి ఉత్సవాలను ఈసారి అమ్మవారి ఆశీస్సులతో ఎంతో వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కావున శ్రీ కనకదుర్గ అమ్మవారి భక్తులందరూ శరన్నవరాత్రులలో జరగబోవు రోజువారి పూజా కార్యక్రమాలలో మీరు పాల్గొనదలచిన దేవస్థానం వద్దకు వచ్చి మీ వివరాలు నమోదు చేసుకొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని తెలియజేస్తున్నామన్నారు.అదేవిధంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొనే భక్తులే కాకుండా ప్రజలందరూ కూడా శరన్నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించి అమ్మ వారి ఆశీస్సులతో మీ జీవితాలలో సుఖ సంతోషాలను ఆయురారోగ్యాలను పొందగలరని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సలహాదారులు చేపూరు.చలమయ్య కోట.లక్ష్మీ నారాయణ కార్యదర్శి గంజం.పెంచల ప్రసాద్,కోశాధికారి సిరిమావిళ్ల.రవిబాబు,



ఉపాధ్యక్షులు కంచర్ల. వెంకటరమణయ్య నాయుడు,సంయుక్త కార్యదర్శులు కంచర్ల.ప్రసాద్ నాయుడు,జెట్టి.సుబ్రమణ్యం,మోదేపల్లి.శ్రీహరి,చిన్ని. వెంకట రమణయ్య,బొడ్డు. ప్రసాద్ ఆచారి,మహిమలూరు.సతీష్ కుమార్,సంపతి .మురళి,చిలకాల.గురు ప్రసాద్,కార్యాలయ ప్రముఖ్ చిన్నిబోయిన.నాగేశ్వరరావు,పాలక మండల సభ్యులు కాటాబత్తిన.మల్లికార్జునరావు, ముక్కు.హరిక్రిష్ణ,శింగరి. వేణు,గంజం,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# ప్రకృతి సాగు పద్ధతులను అవలంబించాలి.

పెన్‌పవర్,ప్యాపిలి: మండలంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్యప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ప్రత్యేక స్టాల్‌ను డిప్యూటీ తహశీల్దార్ శ్రీ కృష్ణ సందర్శించి, పరిశీలించారు. ఈ స్టాల్‌లో రసాయనాలు లేకుండా కేవలం ప్రకృతి పద్ధతుల్లో పండించిన తాజా ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలను (వంకాయలు, బెండకాయలు, టమోటాలు) ప్రదర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ "రసాయన ఎరువుల వాడకం వల్ల భూములు నిస్సారమవడమే కాకుండా మానవ ఆరోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్యాపిలి మండల రైతులు



పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ, ఆరోగ్యకరమైన ప్రకృతి సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో రైతులను చైతన్యపరుస్తూ ఈ ప్రదర్శన ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని, కేడర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

# రామతీర్థంలో 'వీపీఆర్ అమృతధార' నూతన వాటర్ ప్లాంట్

**ప్రారంభించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





కోవూరు పెన్ పవర్ జూలై 6. ఘనంగా రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని సూచన రామతీర్థంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వీపీఆర్ అమృతధార మినరల్ వాటర్ ప్లాంట్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి నూతన కార్యాలయాన్ని కూడా ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు నిన్న అంకురార్పణ జరగగా, ఈ రోజు కొడిముద్ద కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, రాబోయే పది రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో భక్తుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, ఆ విజ్ఞప్తికి స్పందించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వెంటనే వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేశారని పేర్కొన్నారు. వీపీఆర్ అమృతధార ద్వారా 2016 నుంచే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా వీపీఆర్ ఫౌండేషన్ చేపడుతోందన్నారు. ఇప్పటివరకు నెల్లూరు జిల్లాలో 200కు పైగా వాటర్ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకువచ్చామని, కోవూరు నియోజకవర్గంలోనే 30కు పైగా ప్లాంట్లు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారి సన్నిధిలో ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం వీపీఆర్ ఫౌండేషన్‌కు అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజా సేవలో భాగంగా వీపీఆర్ ఫౌండేషన్ చేపడుతున్న వీపీఆర్ నేత్ర సేవలు విశేష స్పందన పొందుతున్నాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇటీవల విడవలూరు మండలంలో నేత్ర సేవలు విజయవంతంగా పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాళెంలో వీపీఆర్ నేత్ర మొబైల్ బస్సు సేవలు అందిస్తున్నాయని, ఇది ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలల ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ప్రజలు కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా వీపీఆర్ నేత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీపీఆర్ ఫౌండేషన్ తరఫున సేవా కార్యక్రమాలను



విజయవంతంగా నిర్వహిస్తున్న సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచే ప్రజా సేవ చేస్తున్నామని, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా అదే సేవా స్ఫూర్తితో కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఈ సేవలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.రామతీర్థం కోనేరు చుట్టూ రోడ్ల అభివృద్ధికి జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మన్న తన నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. బ్రహ్మోత్సవాల దృష్ట్యా ముందుగా సింగిల్ లేయర్ రోడ్డును పూర్తి చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం రెండు వైపులా శాశ్వత సిమెంట్ రోడ్లు నిర్మించేలా చర్యలు చేపడతామని చెప్పారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు, ఈవో, ట్రస్టు బోర్డు ఛైర్మన్, సభ్యులు, స్థానిక నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇప్పటికే నిర్వహించిన సమీక్ష సమావేశంలో భక్తుల సౌకర్యాలపై చర్చించామని తెలిపారు. శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగాలని, స్వామివారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఏటూరి హరిరెడ్డి, మండల కోఆర్డినేటర్ అడపాల శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, క్లస్టర్-8 ఇన్‌ఛార్జి చెముకుల శ్రీనివాసులు, క్లస్టర్-9 ఇన్‌ఛార్జి కొమ్మి శ్రీధర్, మత్స్యకార సంఘం నాయకుడు ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు

# మానవత్వం చాటుకున్న వరికూటి అశోక్ బాబు.

భట్టిప్రోలు పెన్ పవర్,జూలై06 వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామ వైసీపీ పార్టీ అధ్యక్షులు రంగయ్య ఈరోజు ఉదయం చెరుకుపల్లి వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్ ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు రోడ్డు ప్రమాదానికి గురి అయిన రంగయ్య కు రక్తం అవసరం అవుతుందేమో బంధువులను పిలిపించండని వైద్యులు తెలపడంతో నేను కూడా తనకి బంధువునేఅంటూ నేను నా



కుమారుడు గౌతమ్ బాబు రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పి తన నాయకుడి కోసం తానే స్వయంగా రక్తదానం చేయటానికి సిద్ధపడి మానవత్వం చాటుకున్నారు. రెండు గంటల అనంతరం రక్తం అవసరం లేదని వైద్యులు చెప్పడంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వేమూరు నియోజకవర్గానికి చెందిన పలువురి రోగులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి ప్రభుత్వ వైద్యశాల నుండి వెళ్ళిపోయినారు

# ఎస్ ఐ ఆర్ 'లో 100 శాతం డిజిటలైజేషన్ సాధించాలి

## కోవూరులో 98.37 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి
## డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి
## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం టెలి కాన్ఫరెన్స్‌లో : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



నెల్లూరు పెన్ పవర్ జూలై 6. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లోనూ 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయడమే మన లక్ష్యం కావాలని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్లు, బీఎల్ఏ( బి ఎల్ ఏ )లు, కార్యకర్తలతో ' ఎస్ ఐ ఆర్ పురోగతి, చేపట్టాల్సిన తదుపరి చర్యలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం, ప్రజలకు అవగాహన కల్పించడం, ఫారాలు సేకరించడం వంటి కార్యక్రమాల్లో కష్టపడి పనిచేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించారని, ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఇంటిని చేరుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఎన్నికల సంఘం కూడా ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంతో నిర్వహిస్తోందని, అందువల్ల ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కోవూరు నియోజకవర్గంలో మొత్తం 2,69,146 మంది ఓటర్లు ఉన్నారని, 2,64,750 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి 98.37 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని తెలిపారు. అయితే 1,43,305 ఫారాలు మాత్రమే డిజిటలైజ్ కావడంతో 53.24 శాతం మాత్రమే పూర్తైందని, మిగిలిన పనిని మరింత వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి కోవూరు నియోజకవర్గాన్ని జిల్లాలోనే అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. అందుకోసం ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి ఫారాలు పూర్తి చేయించాలని, సేకరించిన ప్రతి ఫారాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేయాలని సూచించారు. చివరి రోజుల్లో పని పేరుకుపోకుండా ప్రతిరోజూ లక్ష్యాలు నిర్దేశించుకుని పూర్తి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా 2002 జనవరి 1 లేదా అంతకంటే ముందు జన్మించిన అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే మండల నాయకత్వం లేదా పార్టీ ఇన్‌చార్జ్‌లకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. కేవలం ఫారాల పంపిణీతో పని పూర్తికాదని, ప్రతి అర్హత కలిగిన ఓటరి ఫారం పూర్తిగా డిజిటలైజ్ అయ్యే వరకు నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, అందరి సహకారంతో కోవూరు నియోజకవర్గాన్ని జిల్లాలోనే అత్యుత్తమ స్థానంలో నిలబెట్టగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మిగిలిన కొద్ది రోజులు ప్రతి కార్యకర్త మరింత చొరవతో పనిచేసి, ప్రతి అర్హత కలిగిన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు

# బుచ్చి మున్సిపాలిటీ లో గ్రీవెన్స్ డే





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 6. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్పర్సన్ మోర్ల సుప్రజ మురళి ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ మాట్లాడుతూ ఈ గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజల నుంచి , డ్రైనేజీ, రోడ్లు, సంబంధించిన అర్జీలను స్వీకరించడం జరిగిందని, తెలియజేశారు.. నా దృష్టికి సమస్య వచ్చిన వెంటనే అధికారులను పురమాయించి వీలైనంత త్వరగా పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని తెలియజేశారు...

పట్టణంలో ఏ సమస్య ఉన్న నా దృష్టికి తేవాలని నావల్ల కానీ పక్షంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.... ఈ గ్రీవెన్స్ డే ను ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని చైర్పర్సన్ తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఇనమల చినబాబు, పాల్గొన్నారు....

# మా ఊరికి రోడ్డు వేయండంటూ వేడుకుంటున్న విద్యార్థులు

## పెదకూరపాడు నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితి పై చిన్నారుల ఆవేదన

## తమ్మవరంనుండి 75 తాళ్లూరు





పెదకూరపాడు పెన్ పవర్,జూలై06 నియోజకవర్గంలోని రోడ్లు పరిస్థితి అధ్వానంగా మారాయి అనడానికి తమ్మవరం గ్రామంలోని విద్యార్థులు చేసిన వీడియో నిదర్శనం. నియోజకవర్గంలోని పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు నుండి తమ్మవరం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రతీ రోజు స్కూల్ కి వెళ్ళడానికి ఇబ్బందిగా ఉందని మా ఊరికి వెళ్ళడానికి రోడ్డు వేయాలని వేడుకుంటూ విద్యార్థులు వీడియో చేశారు. గత ప్రభుత్వం లో నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న నియోజకవర్గంలో కనీసం రోడ్ల పరిస్థితి కూడా పట్టించికోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# కాకినాడలో విజయవంతంగా ముగిసిన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమం.

కాకినాడ పెన్ పవర్,జూలై06జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు నిర్వహించిన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమం కాకినాడ జిల్లాలో ఘన విజయంతో ముగిసింది ఏడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2,900 దరఖాస్తులు నమోదు కావడం జనసేన పార్టీ పట్ల ప్రజలు, జనసైనికులు, వీర మహిళలు వ్యక్తం చేస్తున్న అపార విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కాకినాడ పార్లమెంట్ పరిశీలకులుగా బాధ్యతలు నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ఏడు రోజుల పాటు జిల్లాలోనే ఉండి ప్రతి దరఖాస్తు నమోదును స్వయంగా పర్యవేక్షిస్తూ పార్టీ శ్రేణులకు నిరంతరం మార్గనిర్దేశనం చేశారు రబ్బరు చెప్పులు వేసుకున్న కార్యకర్తతో రాజకీయాలు చేయిస్తా అనే జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సంకల్పానికి అనుగుణంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం కాకినాడ జిల్లాలో విజయవంతంగా పూర్తయింది ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అంకితభావంతో కృషి చేసిన 27 మంది బృంద సభ్యులకు, జనసైనికులకు, వీర మహిళలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇదే స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు




# సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన ఎస్టీయు ఉలవపాడు మండల శాఖ



ఉలవపాడు పెన్ పవర్,జూలై06 ఉలవపాడు మండలం రాష్ట్ర టీచర్స్ యూనియన్‌లిసభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన ఎస్టియు ఉలవపాడు మండల శాఖ :- ఉలవపాడు మండలం రాష్ట్ర టీచర్స్ యూనియన్( ఎస్ టి యు) సోమవారం మండలంలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలో పనిచేయుచున్న టీచర్లకు క్యాజువల్ లీవ్ పుస్తకాలు, లంచ్ క్యారేజ్ బ్యాగులు పంపిణీ చేసి టీచర్ల పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి కాటాబత్తిన కృష్ణ, మండల అధ్యక్ష కార్యదర్శులు బడితల శ్రీనివాసులు, వేల్పుల రమేష్ మరియు పిగిలి శ్రీనివాసరావు, గట్టి బోయిన రమేష్, ఆలూరి చిట్టిబాబు, అంబటి ప్రసాద్, వెంకట సునీల్ కుమార్, రాయపాటి భాస్కర్, ఓగుబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

# బాబు జగజ్జీవన్ రామ్ ఆశయాలు చిరస్మరణీయం: మండా ప్రసాద్

## జయంతి సందర్భంగా విగ్రహానికి ఘన నివాళులు

పశ్చిమగోదావరి జిల్లా: పెనుగొండ, పెన్ పవర్,జూలై06 భారత మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినట్లు తెలుగు యువత పెనుగొండ మండల అధ్యక్షుడు మండా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమసమాజ స్థాపనే డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ జీవిత లక్ష్యమని అన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని పేర్కొన్నారు. సమర్థవంతమైన పరిపాలకుడిగా దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు నేటి యువతకు, ప్రజాప్రతినిధులకు ఆదర్శమని అన్నారు. బాబు జగజ్జీవన్ రామ్ ఆశయాలను ఆచరణలో పెడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయులు చూపిన మార్గంలో నడవడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని మండా ప్రసాద్ పేర్కొన్నారు.



# రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిసిన శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

## పోలవరం మండలానికి ఐసీడీఎస్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని విజ్ఞప్తి





పోలవరం/. పెన్ పవర్,జూలై06 అమరావతి సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్, కొవ్వాసు జగదీశ్వరి, ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలకు సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి,ఆమెకు వినతిపత్రాలను సమర్పించారు.అరకు నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్‌కు నిధుల మంజూరు చేయాలని వినతి అల్లూరి సీతారామరాజు జిల్లా,అరకు నియోజకవర్గం, డుంబ్రిగూడ మండలం అంజోడ గ్రామంలో గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు స్థలం కేటాయించి,నిధులు మంజూరు చేయడం జరిగింది,అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వెనక్కి తీసుకోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి,ఈ స్పోర్ట్స్ స్కూల్ ద్వారా ఎంతో మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన విషయం ప్రస్తావిస్తూ,గిరిజన యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్పోర్ట్స్ స్కూల్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేసి,ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేయాలని మంత్రి ని కోరారు. పోలవరం మండలానికి ఐసీడీఎస్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని పోలవరం మండలంలో 1975లో ప్రారంభమైన ఐసీడీఎస్ ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం 2023 జూన్‌లో కొయ్యలగూడెం మండలంలో విలీనం చేసింది,ప్రస్తుతం కొయ్యలగూడెం మండలంలో 79 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా,పోలవరం మండలంలో 89 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి,అంతే కాకుండా పోలవరం పూర్తిగా ఏజెన్సీ మండలం కావడంతో అక్కడే ప్రాజెక్టు నిర్వహించడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు, పోలవరం మండలంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన భవనం,పూర్తి మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నందున, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొయ్యలగూడెం నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టును తిరిగి పోలవరం మండలానికి మార్చి,గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. తదితర శాలపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు,ఈ భేటీలో రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

# ఆలపాక లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి

నెల్లూరు పెన్ పవర్,జూలై06 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ కి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు ఆలపాక లక్ష్మయ్య కోడలు మరియు ఆలపాక గోపి సతీమణి ఆలపాక కామేశ్వరి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో నేడు వారి స్వగృహానికి వెళ్లి స్వర్గీయ కామేశ్వరి మామ గారైన లక్ష్మయ్య ని మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ మంత్రి వైసీపీ రాష్ట్ర పి ఏ సి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వైసీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కోడూరు మధుసూదన్ రెడ్డి బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ అధ్యక్షులు షేక్ షాహుల్ బుచ్చిరెడ్డిపాలెం రూరల్ మండలం అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి వైసీపీ యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కడివేటి అన్వేష్ రెడ్డి మరియు స్థానిక వైసీపీ నాయకులు పంబాక శేషయ్య అలపాక కిష్టయ్య పనబాక మహేష్ అలపాక వెంకట్ తాండ్ర శ్రీనివాసులు పునమల్లి మస్తానయ్య పటాన్ షారూక్ మరియు తదితరులు పాల్గొన్నారు



# రావణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఉపా చట్టం పెట్టడాన్ని ఖండిస్తు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నిరసన..




గుంటూరు, పెన్ పవర్, జులై, 06, యూట్యూబర్ ప్రశ్న రావణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఉపా చట్టం పెట్టడాన్ని ఖండిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించాడని, విమర్శించాడని, బూతులు మాట్లాడారంటూ బచ్చులకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ పై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసి పలు పోలీస్ స్టేషన్లో, కోర్టుల చుట్టూ తిప్పారనీ ప్రతి చోట ఆయనకు బెయిలు వచ్చిందనీ ఏదేమైనా ప్రశ్న రావన్ను జైలుకు పంపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉపా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమని ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఆయా ప్రభుత్వాలకు పోలీసులు బానిసలవలె పనిచేయటం పరిపాటిగా మారిందనీ ఉపా చట్టం ఏ రకంగా వర్తిస్తుందో పోలీసు యంత్రాంగమే సమాధానం చెప్పాలనీ ప్రశ్నించారు. దేశద్రోహులుగా ఉన్న వారికి మాత్రమే ఉపా చట్టం వర్తిస్తుందనేది గుర్తించాలనీ ఒక చట్టం వర్తిస్తుందా లేదా అనే విచక్షణ లేకుండా ప్రశ్నా రావణ్ పై ఉపా చట్టం ప్రయోగిస్తున్నారనీ దీనిని తీవ్రంగా తప్పుపడుతున్నామని అన్నారు. ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ప్రజాసంఘాలు, పౌర హక్కుల సంఘాల ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ఒకవైపు కోరుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఒక చిన్న కారణం చూపి ప్రశ్న రావణ్ పై ఉపా చట్టం నమోదు చేయటం తగదనీ . తమకు ఎదురు మాట్లాడితే ఎంతకైనా తెగించి వారిని జైల్లో పెడతామనే హెచ్చరిక చేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఇటువంటి చర్యలకు పూనుకోవడం విచారకరమని భారతదేశంలో ఎక్కడైనా విమర్శలు చేసిన వారిపై ఉపా చట్టం ఉపయోగించిన దాఖలాలు లేవనీ దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి ప్రశ్న రావణ్ పై ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ, సహాయ కార్యదర్శి నాగభూషణ్ , ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలి , ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అమర్నాథ్, అజయ్, ప్రణీత్ , మహేష్ తదితరులు పాల్గొన్నారు

# మండల మహిళా అధ్యక్షురాలు గా రాజేశ్వరి గౌడ్.



భట్టిప్రోలు, పెన్ పవర్ (జులై, 06)భట్టిప్రోలు మండల జై గౌడ్ ఉద్యమ మండల మహిళా అధ్యక్షురాలుగా భట్టిప్రోలు గ్రామానికి చెందిన జంపని రాజేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర అధ్యక్షులు చిట్టి బొమ్మ కిషోర్ గౌడ్ నియామక పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన కిషోర్ గౌడ్ తదితర సంఘ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.గౌడ సంఘ నియమ నిబంధనలకు లోబడి మన సంఘమును బలోపేతం చేయుటకు కృషి చేస్తానని తెలిపారు. ఎప్పటికప్పుడు జాతీయ సంఘ,రాష్ట్ర సంఘ సలహాలు సూచనలపై పని చేస్తారని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.సంస్థ ఆశయాలకు, నిబంధనలకు కట్టుబడి పని చేస్తానని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్,సర్దార్ గౌతు లచ్చన్న,ఎందరో గౌడ మహనీయుల ఆశయాలను సాధించే దిశలో కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. మండల అధ్యక్షురాలుగా ఎంపికైన జంపాని రాజేశ్వరిని గ్రామ,మండల పరిధిలోని గౌడ సంఘీలు,రాజేశ్వరి అభిమానులు అభినందనలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేకే జగన్ దుష్ప్రచార మోతాదు పెంచాడు : ప్రత్తిపాటి

## ప్రజా విశ్వాసం పొందలేకే కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రేపుతున్నాడు.

## చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల్లో రెండు హైలెవల్ వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.





చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 06 : చిలకలూరిపేట : కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అబివృద్ధి.. సంక్షేమం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లు రాష్ట్రాభివృద్ధికోసం చేస్తున్న కృషి ప్రజలు గుర్తించకూడదన్న ఓర్వలేని తనంతోనే గొడ్డలిపార్టీ, ఆ పార్టీ అధినేత జగన్ అవినీతి మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వంపై విషప్రచార మోతాదు పెంచారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల్లో పర్యటించారు. గోవిందాపురం–గోనెపూడి గ్రామాల మధ్య మార్గంలో రూ.40 లక్షలతో, చందవరం–సాతులూరు డొంకమార్గంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న హై లెవల్ వంతెనలకు ప్రత్తిపాటి స్థానిక నాయకులతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన గోవిందాపురంలో విలేకరులతో మాట్లాడారు.

వైసీపీ ఏజెంట్లే ఇంటింటికీ తిరిగి తమ పార్టీ సానుభూతిపరుల వివరాలు సేకరిస్తుంటే..ఓట్లు ఎవరు తొలగిస్తారు?

జగన్ ఐదేళ్ల పాలన విధ్వంసం, అవినీతికి ప్రతిరూపమని, వైసీపీ గొడ్డలిపార్టీ అని ప్రజల్లో నాటుకుపోయిన నమ్మకాన్ని చెరిపేసేందుకు జగన్, కూటమి ప్రభుత్వంపై, సొంత మీడియా, సామాజిక మాధ్యమాల్లో విషప్రచారానికి తెరలేపాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై అవినీతి మీడియాలో జగన్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడన్న ప్రత్తిపాటి.. తన పార్టీ బీఎల్ఏలు ఇంటింటికీ తిరిగి వైసీపీ సానుభూతిపరుల సమాచారం సేకరించి, నేరుగా బీఎల్ఓలకు అందిస్తున్నారని, వారు పున: పరిశీలించి డిజిటలైజ్ చేస్తున్నారని, ఈ వ్యవహారంలో ఓట్ల తొలగింపునకు ఎక్కడ ఆస్కారముంటుందని ప్రత్తిపాటి నిలదీశారు. ఎంతసేపు ఏదోరకంగా తన అవినీతి మీడియాలో ప్రభుత్వంపై బురదజల్లడం తప్ప, జగన్ కు మరో ఆలోచన లేదని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.

కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రేపేందుకే... జగన్ సోషల్ మీడియా దుష్ప్రచారానికి శ్రీకారం చుట్టాడు

ప్రజా విశ్వాసాన్ని పొందలేకనే జగన్ ప్రాంతీయ, కుల, మత విద్వేషాలు రేపుతున్నాడని, దానిలో భాగంగా సామాజిక మాధ్యమాలను సాధనంగా వినియోగించుకుంటున్నాడని ప్రత్తిపాట పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న జగన్ కుట్రలు ఎన్నటికీ నెరవేరవన్నారు. అలజడులు, ఆందోళనలు రేకెత్తించి, తద్వారా గతంలో తన పార్టీ సాగించిన విధ్వంస, అవినీతి విధానాలను కూటమిప్రభుత్వానికి ఆపాదించాలన్నదే జగన్ పన్నాగమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. జగన్ దుర్మార్గపు ఆలోచనలకు కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులు మద్ధతు పలుకుతున్నారని, వారిని ప్రభుత్వం ఉపేక్షించదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేకే జగన్ రోజురోజుకీ దిగజారుతున్నాడన్నారు. జగన్ తన బుద్ధి మార్చుకోకుండా, ఇదే పంథా కొనసాగిస్తే, 2024 ఎన్నికల్లో తనకు పోలైన ఓట్లన్నీ, వచ్చే ఎన్నికల్లో కూటమిపార్టీల వైపు మొగ్గుతాయని ప్రత్తిపాటి తెలిపారు.

4 ప్రధాన గ్రామాలను అనుసంధానించేలా హై లెవల్ వంతెనల నిర్మాణం

గోవిందపురం–గోనెపూడి, చందవరం -- బుక్కాపురం గ్రామాల్ని అనుసంధానించే మార్గాల్లో రూ.55 లక్షలతో రెండు హైలెవల్ వంతెనల నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేసినట్లు ప్రత్తిపాటి చెప్పారు. వంతెనలు నిర్మించాక, వీబీ జీ రామ్ జీ నిధులతో సౌకర్యవంతంగా ఆయా గ్రామాలను అనుసంధానించే ప్రధాన రోడ్లను నిర్మిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. సరైన రవాణా సౌకర్యం ఏర్పడితే, రైతులకు మేలుజరగడంతో పాటు, భూముల ధరలు పెరుగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, పిల్లి కోటేశ్వరరావు, బండారుపల్లి మస్తాన్ రావు, రమణ రెడ్డి, వెంకట రామి రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రకాశం, సిద్ధ రెడ్డి, చుండు అనిల్, రామ కోటయ్య, రాఘవయ్య, హనుమంతరావు, సాంబశివరావు టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోళ్లపాలెంలో విద్యార్థులకు దాతల పుస్తకాల వితరణ



భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 06: దాతల సహాయ,సహకారాలను సద్వినియోగ పరచుకొని చక్కని విద్యనభ్యసించాలని భట్టిప్రోలు మండల విద్యాశాఖ అధికారి నీలం దేవరాజు అన్నారు.సోమవారం భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయితీ శివారు కోళ్లపాలెం గ్రామంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో భట్టిప్రోలు నివాసి బొలిశెట్టి చిట్టెమ్మ జ్ఞాపకార్థం విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు పుస్తకాలు మరియు స్టేషనరీని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాశాఖ అధికారి దేవరాజు మాట్లాడుతూ దాతల సహకారాన్ని వినియోగించుకుని చక్కని చదువులు అభ్యసించాలన్నారు. దాత బిఎస్సార్ మాస్టారు తన సందేశంలో రండి-వినండి,చదవండి, వ్రాయండి అని అన్నారు.వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ నంబూరు నాగభూషణరావు మాట్లాడుతూ బాల బాలికలు విద్యాసామాగ్రి తీసుకునే స్థాయి నుండి పదిమందికి పంచే స్థాయికి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పసుపులేటి శివరామప్రసాద్, ఉపాధ్యాయులు యన్.శివరామ కృష్ణ, కె.సుజాత మరియు తల్లితండ్రులు పాల్గొన్నారు.

# బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



గుంటూరు, పెన్ పవర్, జులై, 06, భారత మాజీ ఉప ప్రధాని, సామాజిక న్యాయ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహానేత బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వారి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ, బాబు జగజ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం, ప్రజాసేవ కోసం చేసిన విశిష్ట కృషి దేశానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాబు జగజ్జీవన్ రామ్ కి ఘనంగా నివాళులు అర్పించారు.

# ఎస్.ఐ.ఆర్ నిర్వహణలో బి యల్ ఓ లు క్రమశిక్షణతో పని చేయాలి





భట్టిప్రోలు, పెన్ పవర్ జులై, 06: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను బి.యల్.ఓలు క్రమశిక్షణతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి భట్టిప్రోలు మండలం, రాచూరు గ్రామం లో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని డి.ఆర్.ఓ. జి.గంగాధర్ గౌడ్ తో కలసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా జిల్లా కలెక్టర్ ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న బి.యల్.ఓ పనితీరును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారం మీకు ఇంటి వద్దకు వచ్చి ఇచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని బి.యల్.ఓలకు సూచించారు.సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా,నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బిఎల్ఓలను కలెక్టర్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ఓటర్లతో మాట్లాడుతూ బీఎల్ఓ మీ ఇంటికి ఎన్యూమరేషన్ ఫారం తీసుకొచ్చారా, ఫారాన్ని ఎలా నింపాలో పూర్తి వివరాలు తెలియజేశారా, అవసరమైన పత్రాల గురించి వివరించారా అని ఓటర్లను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బి.యల్.ఓలు ఒక క్రమశిక్షణతో ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని బి.యల్.ఓలను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో శ్రద్ధగా పనిచేయాలన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా చేయాలని బి.యల్.ఓను ఆదేశించారు. బి.యల్.ఓలు రోజుకు 80 దరఖాస్తులు పూర్తి చేయాలని,మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా చేపట్టాలని బి.యల్.ఓలను ఆదేశించారు.

బిఎల్ఓలకు అదనంగా సహాయకులు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూపర్వైజర్ ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బి.శ్రీదేవి,తహశీల్దార్ నాగరాజు,ఆర్ ఐ, సూపర్ వైజర్,బి యల్ ఓలు గ్రామ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తూబాడులో హెచ్ఐవి అవగాహన సదస్సు




చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 06 : నాదెండ్ల : మండల పరిధిలోని తూబాడు గ్రామంలో సోమవారం హెచ్ఐవి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం ఊహ, అవుట్రీచ్ వర్కర్ షేక్ షమీమ్ గ్రామస్తులకు హెచ్ఐవి వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ఎంతో ముఖ్యమని వివరించారు. అలాగే హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకుండా, వారికి మానసికంగా అండగా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు అవసరమైన సందర్భాల్లో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయండి

బనగానపల్లె, పెన్ పవర్, జూలై6 బనగానపల్లె పట్టణంలో ఈనెల 9న మీ భూమి, మీ హక్కు కార్యక్రమంలో భాగంగా బనగానపల్లెకు వస్తున్న సీఎం చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టరు రాజకుమారి, ఎస్పీ సునీల్‌షోరాన్ అ?ధికారులను సోమవారం ఆదేశించారు. బనగానపల్లెలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో మంత్రి బీసీతో కలసి కలెక్టరు బనగానపల్లెలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంశంలో సమన్వయంలో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్‌తో కలసి హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ప్రజావేదిక, పార్కింగ్ ప్రాంతాలు, తహసీల్దారు కార్యాలయం, రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించే ప్రదేశాలను పర్యటించి ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం అన్నారు. ప్రతి ఏర్పాటును నాణ్యతతో సమయపాలనతో పూర్తి చేయాలన్నారు.

# కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ 5వ వార్షికోత్సవ వేడుకలు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం శ్రీ రఘురామ్






విజయవాడ, పెన్ పవర్, జులై,06, న్యూఢిల్లీ, జూలై 6: న్యూఢిల్లీలోని భారత్ మండపం, ప్రగతి మైదాన్ వేదికగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సహకార్ సే సమృద్ధి -- 5 స్వర్ణిమ్ సంవత్సరాలు: విజయాలు, నవకల్పనలు, వికసిత్ భారత్ దిశగా అడుగులు" అనే అంశంపై జాతీయ స్థాయి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కేంద్ర హోం వ్యవహారాలు మరియు సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై, సహకార రంగంలో గత ఐదేళ్లలో సాధించిన విజయాలను వివరించడంతో పాటు పలు జాతీయ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు (ఏ పి సిఓఎ) చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వెంకట రామకృష్ణ, రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల (డీసీసీబీస్ ) చైర్మన్లతో కలిసి మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రపంచంలోనే అతిపెద్ద సహకార ధాన్య నిల్వ (గ్రాయిన్ స్టోరేజ్ ) పథకం కింద మొత్తం 75,000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో 135 ఆధునిక గోదాములను రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ప్రారంభించారు. ఈ గోదాములు రైతులకు పంట నిల్వ, మార్కెటింగ్, విలువ ఆధారిత సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు దోహదపడనున్నాయి.అదేవిధంగా సహకార రంగాన్ని ఆధునీకరించే లక్ష్యంతో నేషనల్ కోఆపరేటివ్ డేటాబేస్ (నసీడీ ) 3.0, జియో-ట్యాగ్ మొబైల్ యాప్, చీణణదీ మిల్క్ సప్లై మానిటరింగ్ డ్యాష్‌బోర్డ్, సహకార్ సీబీస్ , సహకార్ సహయోగి (కృత్రిమ మేధస్సు ఆధారిత వేదిక), భారతీయ బీజ్ సహకారి సమితి టిష్యూ కల్చర్ కేంద్రాలు వంటి పలు డిజిటల్, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సహకార రంగానికి కొత్త దిశను చూపిందని అన్నారు. కేంద్ర హోం మరియు సహకార శాఖ మంత్రి అమిత్ షా దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు సహకార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతికంగా బలోపేతం చేయడంతో పాటు రైతు కేంద్రితంగా తీర్చిదిద్దుతున్నాయని కొనియాడారు.దేశవ్యాప్తంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు రాష్ట్ర సహకార బ్యాంకులను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సహకార ధాన్య నిల్వ పథకం, డిజిటల్ సేవల విస్తరణ, పారదర్శక పాలన వంటి కార్యక్రమాలు రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చడంతో పాటు "సహకారం ద్వారా సమృద్ధి -- వికసిత్ భారత్" లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని నెట్టెం శ్రీ రఘురాం అన్నారు.దేశవ్యాప్తంగా రాష్ట్ర సహకార బ్యాంకుల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ప్రతినిధులు, సహకార సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సహకారం ద్వారా సమృద్ధి -- వికసిత్ భారత్" లక్ష్య సాధనలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు దేశ సహకార రంగ అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ నివాళులు



గుంటూరు, పెన్ పవర్, జులై, 06, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులు జగజ్జీవన్ రామ్.అలాంటి మహనీయులను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి.మావిగన్ పేరుతో జగన్మోహన్ రెడ్డి మరో కొత్త నాటకానికి తెర తీసారు.మరలా రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయకుండా జగన్ ఊరుకోడు.2029 లో జగన్ గెలిస్తే విశాఖపట్నం లోనే ప్రమాణస్వీకారం చేస్తారు.రుషి కొండ ప్యాలెస్ లోనే ఉంటాడు.సిఐ నాగరాజు వేధింపులు తాళలేక దళిత యువకుడు క్రాంతి కుమార్ సెల్ఫీ వీడియో విడుదల చేసి ఆత్మహత్య చేసుకుంటే ఇంతవరకు చర్యలు లేవు.డిజీపీ వెంటనే చర్యలు తీసుకుని పోలీసు యంత్రాంగాన్ని గాడిన పెట్టాలి.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలిఅని డొక్కా కోరారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్న పార్లమెంట్ సభ్యులు శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ బాబు జగజీవన్ రావ్ అని, వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ, వారు చూపిన స్ఫూర్తితో పనిచేస్తామని తెలిపారు. వ్యవసాయ రంగంలో గానీ, కార్మిక రంగంలో గానీ, రైల్వే రంగంలో కానీ మరియు వారు పనిచేసిన మీద శాఖల్లో వారు చేసిన సేవలను కొనియాడారు. టిటిడి బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బాబు జగజీవన్ రావు గారు గొప్ప మానవతావాది, పేద ప్రజలకు వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ , వారి అడుగుజాడల్లో నేటి యువత పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ జన సేవా సమితి నాయకులు అత్తోట జోసెఫ్ కుమార్, పరంగ సత్యరాజు జనసేన పార్టీ నాయకులు పాలకాయల వెంకట్, మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు అంగిరేకులవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ పై ప్రజలు చైతన్యవంతులు కావాలి బీఎల్వోలకు పూర్తి సహకారం అందించాలి ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, పెన్ పవర్, జులై, 06, బూత్ లెవెల్ అధికారులు మీకు అందించిన ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి అప్పగించారా ? ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో ఏవైనా సందేహాలు ఉన్నాయా ? వెంటనే ఫారాలను బూత్ లెవెల్ అధికారులకు ఇవ్వండి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. నియోజకవర్గంలో ఇంటింటి పర్యటనలో భాగంగా సోమవారం స్థానిక 12 డివిజన్ లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు ఎన్యూమరేషన్ ఫారాలు అందించారా అని అడిగి తెలుసుకున్నారు. కుటుంబీకుల వివరాలను ఓట్లకు మ్యాచ్ అవుతున్నాయో ? లేదో సరి చూసుకోవాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేస్తే వెంటనే బీఎల్వోలకు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున గుంటూరు తూర్పు నియోజకవర్గ ఓటర్లందరూ వెంటనే స్పందించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో ఏవైనా సందేహాలు ఉంటే కూటమి నాయకుల వద్ద సహకారం తీసుకోవాలని, వారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్ గడువు చివరి రోజుల్లో ఏవైనా సర్వర్ సమస్యలు తలెత్తితే ఇబ్బందులు ఎదురవుతాయని, కావున ఓటర్లందరూ చైతన్యవంతులై సర్ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వీటితోపాటు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పింఛన్లు, శానిటేషన్ వంటి అంశాలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్యకూ ప్రణాళికాబద్ధంగా పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు.

# పున్నమ్మతోట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ఆలయ అధీక్షకులు ఎం.మల్లికార్జున్



విజయవాడ, పెన్ పవర్, జులై, 06, తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7 న కోయిల్ ఆళ్వార్ తిరుమంజసం 8 న వార్షికోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధీక్షకులు ఎం. మల్లికార్జున్ తెలిపారు. ఇందులో భాగంగా టిటిడి ఆగమ సలహాదారు పరాశరం భావనారాయణ చార్యులు కంకణ భట్టార్ వరాహ వెంకట శశి కిరణ్ మరియు ఇతర రుత్వికులు సమక్షం లో ఈ నెల 7 వ తేదీ మంగళవారం ఉదయం 7 గంటలకు ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారని తెలిపారు.అనంతరం భక్తులను స్వామివారి సర్వదర్శనానికి అనుమతి తెలిపారు.జూలై 8న ఆలయ వార్షికోత్సవాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ వార్షికోత్సవం వేడుకలను వైభవంగా నిర్వహించెండుకు ఏర్పాట్లు చేశామన్నారు.ఇందులో భాగంగా ఉదయం 7.20 నుండి 1.45 గంటల వరకు అష్టోత్తరశతకలశాభిషేకము, మహాశాంతి హోమము, వర్షవర్ధన హోమము, మహాపూర్ణాహుతి, మహా స్నపనము, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఆలయ ఇన్స్పెక్టర్ లలితా రమాదేవి దాతలు స్థానిక భక్తుల సమక్షంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎం.మల్లికార్జున్ ప్రకటనలో తెలిపారు .

# ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

అమరావతి:పెన్ పవర్,జూలై06 ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా నియమితులైన సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది

ఈ నియామకాలతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు పెరిగింది. హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన అదనపు న్యాయమూర్తులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శుభాకాంక్షలు తెలిపారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్ జాతీయ క్రీడా దినోత్సవం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ




విజయవాడ, పెన్ పవర్, జులై, 06, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఆగస్టు 26 వరకు అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోటీలు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అధికారులతో కలిసి ఛాంపియన్‌షిప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనునున్నట్లు తెలిపారు. అండర్--17, అండర్--23 విభాగాలకు చెందిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని.. రాష్ట్రవ్యాప్తంగా విజేతలకు మొత్తం రూ. 91.90 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ ఒక మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌ను జిల్లాలో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా పాఠశాలలు, కళాశాలలు, క్రీడా సంఘాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జెడ్పీ సీఈవో డా. జె.అరుణ, డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇగ్నైట్‌తో సర్ చైతన్యం జిల్లాకలెక్టర్ డా. జి.లక్ష్మీశ




విజయవాడ, పెన్ పవర్, జులై, 06, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇగ్నైట్ సెల్‌లో సర్ సహాయ కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఎస్ఐఆర్ ప్రాధాన్యతను వివరించడం, 2002 సర్ జాబితాలో వివరాలు చూసుకోవడం, ఎన్యూమరేషన్ ఫారాలను సరైన విధంగా నింపి, బీఎల్‌వోకు అందించడం, డిజిటైజేషన్ ప్రక్రియ తదితరాలపై ఓటర్లకు ఈ సెల్ ద్వారా అవగాహనతో పాటు సహాయసహకారాలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పన లక్ష్యంగా జరుగుతున్న ఈ ప్రక్రియను విస్తృత ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేయనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ ఈ సందర్భంగా అన్నారు.

# ప్రజల నుండి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి అదనపు కమిషనర్ జి.సాంబశివరావు




గుంటూరు, పెన్ పవర్, జులై, 06, సోమవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ కు అందే ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సరఫరా మరియు వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి వివరించి, ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 36 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 8, ఇంజినీరింగ్ విభాగం 15, రెవెన్యూ విభాగం 9, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి 4 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ సంతృప్తి స్థాయిలో జిల్లాను ముందంజలో నిలపండి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






విజయవాడ, పెన్ పవర్, జులై, 06, ప్రజల సమస్యకు అధికారులు పరిష్కారం చూపినప్పుడు వారి ముఖంలో ఆనందం మన కృషికి దక్కిన ఫలితమని.. ప్రజా స్నేహ పూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలకు గడువులోగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపేందుకు అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రారంభానికి ముందు శాఖల వారీగా వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారంపై కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ వెనుక ఒక కుటుంబం ఆశలు ఉంటాయన్న విషయాన్ని గుర్తించి.. అర్జీలను కేవలం విధి నిర్వహణలో భాగంగా కాకుండా, బాధ్యతగా స్వీకరించి సత్వరమే పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. సమస్య పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి అధికారుల పనితీరుకు నిజమైన గుర్తింపు అని పేర్కొన్నారు. అర్జీదారులతో సరైన విధంగా మాట్లాడటం ముఖ్యమని, వారికి సమస్య పరిష్కార ప్రక్రియను స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారని.. సమస్య పరిష్కారంపట్ల నిబద్ధత చూపే అధికారులకు సీఎంవో నుంచి ప్రశంసలు కూడా లభిస్తున్నాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

**మొత్తం 240 అర్జీలు:**

కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 240 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూకు సంబంధించి 74, పోలీసు శాఖకు సంబంధించి 41, పురపాలక పట్టణాభివృద్ధికి సంబంధించి 23 అర్జీలు ఉన్నాయి. ఈ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.